**కథ**

# నేను సైతం

**కారంపూడి వెంకట దామోదాస్**

ఆ దృశ్యం చూసిన నా కళ్లు క్రోధంతో నిప్పుకణికల్లా ఎర్రబడ్డాయి. మరుక్షణమే నిస్సహాయతతో కళ్లు చెమ్మగిల్లాయి. మోండా మార్కెట్టు, రోడ్డుసైడు కొత్తా, పాత బట్టల వ్యాపారుల కేకలతో హోరెత్తిపోతున్నది. ఓ వ్యాపారి వద్ద అనుకోకుండా కంటబడ్డ ఆ కాశ్మీరీ శాలువని చూసినప్పటి నా పరిస్థితి అది.

‘‘అమ్మా! రండి! తీసుకోండి! ఈ శాలువ చూడండీ... సరిగ్గా మీకు నప్పుతుంది. చాలా నాణ్యమైన ఉన్నితో చేసిన అసలైన కాశ్మీరీ శాలువ! కేవలం రెండు వందలే! తీసుకోండమ్మా!’’

నన్ను ఉద్దేశించి ఆ దుకాణదారుడు ఆకట్టుకునేందుకు విఫలయత్నం చేస్తూ అన్న ఆ మాటలు నా చెవుల రంధ్రాలని చీల్చి చెండాడి ఎక్కడో తాకుతున్నాయి.

ఆ శాలువని పరీక్షించి చూశాను. అవును! సందేహం లేదు, అదే. శాలువ! లేత పసుపుపచ్చ ఆ శాలువపైన ‘అమ్మకు ప్రేమతో...’ అన్న ఎర్రని రంగు ఎంబ్రాయిడరీ.. ఆ పక్కనే త్రివర్ణ జాతీయ పతాకం..’ ఆ శాలువ అందాన్ని రెట్టింపు చేశాయి. అది చూసి నా కళ్లు వర్షించడం మొదలైంది.

గతం చేసిన గాయం చిన్నది కాదు. ఈ సంఘటనతో పచ్చిగా ఉన్న గాయం రేపినట్టయింది.

ooo

‘అమ్మా!

నేను క్షేమం. నువ్వు ఆరోగ్యంతో క్షేమంగా ఉన్నావని తలుస్తాను. మన దేశం అందించిన స్నేహ హస్తాన్ని అందుకున్నట్టే అందుకుని వెన్నుపోటు పొడిచిన పాకిస్తాన్ కుతంత్ర ఫలితమే ప్రస్తుత యుద్ధం. కాశ్మీరీ సరిహద్దులలో అహర్నిశలు కాపలా కాసే వేలాది సైనికులలో నేనూ ఒకణ్ని కావడం నా అదృష్టం. శత్రుసైన్యంతో ప్రత్యక్ష, పరోక్ష యుద్ధానికి మేమంతా సిద్ధంగా ఉన్నాం. ఈ సమయంలో నీ మాటలూ, తలంపులే నాకు మనోబలం. అమ్మా! నీ గుండె నిబ్బరం నాకు తెలీంది కాదు. దేశ రక్షణలో నాన్న ప్రాణాలు కోల్పోయినా నన్ను సైన్యంలో చేర్పి జాతికి అంకితం కమ్మని వెన్నుతట్టి ప్రోత్సహించిన నీ ధైర్యం ఎందరి తల్లులకుంటుంది? నీ ఊహ మాత్రమే నాలో గుండె ధైర్యాన్ని రెట్టింపు చేస్తుంది. అమ్మా! నాదొక చిన్న మాట! ప్రత్యక్షంగా మేము, పరోక్షంగా మాకు సేవలు చేస్తూ ఈ కాశ్మీరీ ప్రాంత ప్రజలు దేశభక్తితో శత్రువులతో పోరాడుతున్నాం. వీరిలో చాలా మంది ముస్లింలే అన్నది విశేషం. అమ్మా! నీ కోసం ఎప్పటి నుండో కావాలనుకున్న స్వచ్ఛమైన కాశ్మీరీ శాలువ మొన్నీమధ్యే కొన్నాను. దానిపై అందమైన ఎంబ్రయిడరీ కూడా చేయించాను. త్వరలోనే వస్తాను. నీకు బహూకరిస్తాను.

ఎప్పుడూ నీ తలంపుతోనే...

నీ కొడుకు

సుభాష్’

ఈ ఉత్తరాన్ని ఎన్నిసార్లు చదువుకున్నానో నాకే తెలీదు. ఉత్తరం తెరచినప్పుడల్లా ఎదురుగా నా కొడుకు నిలిచిన మధురమైన అనుభూతి. ఈ అనుభూతులే నన్నింతగా బ్రతికిస్తున్నాయి.

ooo

ఆ రోజు నా జీవితంలో అత్యంత దుర్దినం!

సెలవులకి వస్తాడనుకున్న కొడుకు శవపేటికలో సేద తీరుతూ ఇంటికి చేరడం, ఏ తల్లి మటుకు భరించగలదు? అయినా నా గుండె తట్టుకుంది. వీరమరణం పొంది అత్యంత గౌరవమర్యాదలతో మట్టిలో కలసిన మాణిక్యం కోసం నేను ఏడ్చి నా బిడ్డ మరణాన్ని అవమానపరచదలచుకోలేదు. ఆ దుఃఖాన్ని నా గుండెల్లోనే బంధించాను.

వారం రోజుల తరువాత నా కొడుకు వస్తువులు సైనికాధికారులు నాకప్పగించారు. నా బిడ్డ వస్తువులు నాకు ఆత్మీయులుగా తోచాయి. అందులో నుండి సూట్‌కేస్ తెరచి చూశాను. దానిలో అందమైన కాశ్మీరీ శాలువ! ఆ శాలువపై అందంగా ‘అమ్మకి ప్రేమతో..’ పక్కనే జాతీయ పతాకం రంగులతో ఎంబ్రయిడరీ చేసి ఉన్నది. అది చూసి తట్టుకోలేకపోయాను.

ఇన్నాళ్లూ నాలో గూడుకట్టుకున్న దుఃఖం ఒక్కసారిగా కట్టెలు తెంచుకుంది. ఏడ్చాను.. అలా యిలా కాదు... చాలా చాలా ఏడ్చాను.

ఆ రోజు నుండి ఆ శాలువ నా వంటిలో భాగమైంది. దాన్ని ధరిస్తే కొడుకుని గుండెలకి హత్తుకున్న అనుభూతి!

ooo


నెలలు, సంవత్సరాలు గడుస్తున్నాయి. యాంత్రికంగా నా జీవితం వెళ్లిపోతున్నది.

సరిగ్గా అప్పుడే మళ్లీ నా గుండెలన్నీ కలచివేసిన మరో సంఘటన!

అదే! కాశ్మీరీ సరిహద్దుల్లోనూ, పాకిస్తాన్‌లోనూ భయంకర భూకంపం! వేలాది మంది దుర్మరణం. అందులో కొందరు భారతీయ సైనికులు కూడా ఉన్నారు. వందలాది కాశ్మీరీ ప్రజల ప్రాణాలని బలిగొందా భూకంపం.

అప్పుడు నా కొడుకు రాసిన ఉత్తరంలో ఓ మాట గుర్తుకొచ్చింది. ‘ప్రత్యక్షంగా మేము, పరోక్షంగా మాకు సేవలు చేస్తూ ఈ కాశ్మీరీ ప్రాంత ప్రజలు దేశభక్తితో శత్రువులతో పోరాడుతున్నాం’ అప్పుడే నిశ్చయించుకున్నాను కాశ్మీరీ ప్రాంత ప్రజల్ని ఆదుకోవాలని.

‘నేను సైతం...’ అన్న రీతిలో నడుం బిగించాను. ఇల్లిల్లూ తిరిగాను. ఏదిస్తే అది పుచ్చుకున్నాను. బట్టలూ, తిండిగింజలు, ఇలా ఎన్నో కూడకట్టేను. మరి నా వంతో...? ఆలోచించాను, బాగా ఆలోచించాను.




కొడుకు ప్రేమతో కొన్న నా కాశ్మీరీ శాలువ గుర్తుకొచ్చింది. అంతే మారు ఆలోచించకుండా దాన్ని విరాళంగా ఇచ్చేయదలిచాను.

అది ఏ తల్లిగుండెనో చేరుకుని ఆ మంచుముద్దల్లో ఏ ఒక్కరినైనా వెచ్చగా హత్తుకుంటే నా ఆశయం నెరవేరినట్టే!

నేను సంగ్రహించిన వస్తువులతో పాటు, అపురూపమైన నా శాలువని కూడా తీసుకుని ఓ స్వచ్ఛంద సంస్థకి ఇచ్చి వాటిని బాధితులకి చేరవేయమన్నాను.

ooo

స్వచ్ఛంద సంస్థకి విరాళమిచ్చి నెల తిరగలేదు, మోండా మార్కెట్టులో సెకండ్ హేండ్ వ్యాపారి చేతిలో నలిగిపోతూ అమూల్యమైన నా శాలువ నాకు దర్శనమివ్వడం, దాని గుణగణాలు నాకే వివరిస్తూ అమ్మజూస్తున్న ఆ వ్యాపారి! ఇది చూసి నా హృదయం తట్టుకోలేకపోయింది. నేను సేకరించిన మిగతా వస్తువులు ఆ నడి రోడ్డులో ఏ వ్యాపారి వేలానికి గురవుతున్నాయో?

ఎంతో సహృదయంతో ప్రకృతి పీడితుల్ని ఆదుకోవాలని చూసే దాతలకి ఎదురయ్యే చేదు అనుభవం ఇది! తమ దానాన్ని బజారు అంగడిలో తిరిగి తమకే అమ్మేస్తున్న ప్రబుద్ధులు... ఈ తరుణంలో ఎవర్ని నమ్మాలో ఎవర్ని నమ్మకూడదో తెలీని అయోమయ స్థితిలో దాతలు పడిపోతే, బాధితుల్ని ఆదుకునే దిక్కేది? మన దేశానికి విదేశీ శత్రువుల కన్నా, స్వదేశంలో ఉన్న బడాచోర్ల నుండే ముప్పు ఎక్కువనిపించింది నాకు.

అదృష్టం కొద్దీ నా విలువైన శాలువ నా కంట పడింది. లేకపోతే ఏ అనర్హుల హృదయాన్నో హత్తుకుంటే నా ఆశయం ఘోరంగా దెబ్బతినుండేది.

ఆ అంగడిలో నా లాంటి పరిస్థితే మరెందరిదో...